ప్రజావాణి ఎప్పటి వార్తలు అప్పుడే...
5 PM
మన సమగ్ర ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
మంగళవారం , 13, అక్టోబర్, 2026
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY
https://epaper.prajavaani.net

## ఎన్నికల్లో గెలవలేక రాజ్యాంగ సంస్థలపై
# దండయాత్ర



**ఢిల్లీ, అక్టోబర్ 13:** దేశ రాజధాని ఢిల్లీలో కాంగ్రెస్ చేస్తున్న నిరసన డ్రామాలు చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఈరోజు(మంగళవారం) మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ తన స్థాయి మరిచిపోయి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గతంలో లోక్‌సభ స్పీకర్ రాజీనామా అన్నారని.. ఇప్పుడు సీఈసీ రాజీనామా అంటున్నారని అన్నారు. ప్రధాని మోదీ, అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్‌పై ఆరోపణలు చేస్తున్నారని.. చివరికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గద్దెదిగాలని కాంగ్రెస్ పార్టీ మాట్లాడుతోందని మండిపడ్డారు. సుప్రీంకోర్టు సీజేఐ రాజీనామా చేయాలనడం శోచనీయమని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. వేలాదిగా సుప్రీంకోర్టుకు వెళ్లి న్యాయమూర్తులపై ఒత్తిడి తెచ్చి బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలలో గెలవడం చేతగాక రాజ్యాంగ సంస్థలపై దండయాత్ర చేస్తున్నారని విరుచుకుపడ్డారు. 60 ఏళ్లు పరిపాలించిన కాంగ్రెస్ మానసికస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ప్రజల మద్దతు లేకుండా అనేక ఏళ్లుగా వరుసగా ఓడిపోతుంటే దానికి ఎన్నికల సంఘం ఏ విధంగా బాధ్యత తీసుకుంటుందని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిని బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఎన్నికల్లో ఓడిపోతున్నారని సుప్రీంకోర్టు జడ్జిలను బెదిరిస్తున్నారని కేంద్ర మంత్రి ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే ప్రజల తప్పు అన్నట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. రాహుల్ దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 200 మంది అధికారులు టచ్‌లో ఉన్నారని రాహుల్ గాంధీ అంటున్నారని.. ఎవరిని బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అవినీతి అరాచకాలను ప్రజలు మర్చిపోలేదని కేంద్ర మంత్రి అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, బాబు జగ్జీవన్ రాం, ఎన్టీఆర్‌ను కాంగ్రెస్ పార్టీ అవమానపరిచిందన్నారు. రాహుల్ గాంధీతో రేవంత్ రెడ్డి పోటీ పడుతున్నారని తెలిపారు. రాహుల్ గజం ఎగిరితే, రేవంత్ రెండు గజాలు ఎగురుతున్నాంటూ ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో తాము ఏ ధర్నా చేయాలన్నా హౌస్ అరెస్ట్ చేస్తున్నారని.. హైకోర్టుకు వెళ్లి అనుమతి తీసుకుంటే తప్ప ధర్నా చేయలేని పరిస్థితి ఉందన్నారు. హైదరాబాద్‌లో ధర్నాకు బీజేపీకి పర్మిషన్ ఇవ్వరని. ఢిల్లీలో మాత్రం ధర్నాకు అనుమతి ఇస్తలేరని నీతులు చెబుతున్నారని మండిపడ్డారు. వారానికి ఒకసారి ఢిల్లీ వచ్చి ప్రధానిపై రేవంత్ రెడ్డి ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జంతర్ మంతర్ షిఫ్ట్ చేయాలని స్థానిక ప్రజలు, వ్యాపారులు కోరారని తెలిపారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితులలో ఢిల్లీ ప్రజలు ఉన్నారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

### ఢిల్లీ వదిలి వెళ్లొద్దు - టీ కాంగ్రెస్ నేతలకు
## రేవంత్ రెడ్డి ఆదేశాలు



**ఢిల్లీ,** దేశంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ రాజకీయంగా పెను దుమారం రేపుతున్నవేళ, ఢిల్లీ ఆందోళనల్లో రాష్ట్ర కాంగ్రెస్ నేతలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిరసనల తర్వాత ఢిల్లీలోనే ఉండాలని ఏఐసీసీ, సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ చీఫ్ ఆదేశాలతో రాష్ట్ర నాయకత్వం అక్కడే ఉంది. దీంతో ఈ ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేసే దిశగా ఇండియా కూటమి అడుగులు వేస్తోందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి. పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్?తో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర నేతలు పెద్ద సంఖ్యలో ఢిల్లీకి తరలివెళ్లారు. ఆందోళనలు మరికొన్ని రోజులు జరిగే అవకాశం ఉన్న కారణంగా వెళ్లిన వారంతా అక్కడే ఉండాలని సీఎం, పీసీసీ చీఫ్ ఆదేశించారు. మరోవైపు సోమవారం నిర్వహించిన ఇండియా కూటమి ర్యాలీలో లాఠీఛార్జ్, తొక్కిసలాట చోటు చేసుకుంది. పలువురు తెలంగాణ రాష్ట్ర నేతలు కిందపడటంతో స్వల్ప గాయాలయ్యాయి. ఢిల్లీలో 'మార్చ్ ఫర్ డెమోక్రసీ' ర్యాలీలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ సహా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, డీసీసీ అధ్యక్షులు తరలివెళ్లారు. ర్యాలీకి ముందు తెలంగాణ భవన్‌లోని అంబేద్కర్ ఆడిటోరియంలో శ్రేణులకు రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. మరో స్వాతంత్ర్య పోరాటం స్థాయిలో ఉద్యమించాలని సూచించారు. అనంతరం ఇండీకూటమి నేతృత్వంలో ర్యాలీలో సీఎం రేవంత్‌రెడ్డి సహా మంత్రులు, ఎంపీలు, రాష్ట్ర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

### ఉప్పల్‌లో భారత్ వెస్ట్ ఇండీస్ మ్యాచ్
## 2,200 మంది పోలీసులతో భద్రతా



**హైదరాబాద్ :** ఉప్పల్ స్టేడియంలో జరగనున్న భారత్ – వెస్ట్ ఇండీస్ క్రికెట్ మ్యాచ్ కోసం విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినట్లు మల్కాజిగిరి కమిషనర్ బి.సుమతి తెలిపారు. బుధవారం సాయంత్రం జరగనున్న 4వ టీ20 మ్యాచ్‌కు స్టేడియం లోపల, బయట భద్రత కోసం 2,200 మంది పోలీసు సిబ్బందిని మోహరించినట్లు వెల్లడించారు. మహిళలు, పిల్లల భద్రతను పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా ఐదు 'షీ టీమ్స్'ను రంగంలోకి దించినట్లు తెలిపారు. 408 సీసీటీవీ కెమెరాల ద్వారా నిఘాఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భద్రత, నిఘా చర్యలు చేపడతామని, ఇందుకోసం ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పా టు చేశామని కమిషనర్ తెలిపారు. 408 సీసీటీవీ కెమె రాలు, తొలిసారిగా రెండు డ్రోన్ల సహాయంతో నిరంతర నిఘా కొనసాగుతుందని ఆమె చెప్పారు. నకిలీ టిక్కెట్ల విక్రయాలు, మోసపూరిత వెబ్‌సైట్లు, ఆన్‌లైన్ నేరాలను గుర్తించడంపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు ఆమె పేర్కొన్నా రు. స్టేడియం లోపల, బయట మఫ్టీలోనూ పోలీసు సిబ్బంది విధుల్లో ఉంటారని పోలీసులు తెలిపారు. మ్యాచ్‌కు హాజరయ్యే ప్రేక్షకులు ఆర్టీసీ, మెట్రో రైలు సేవలను వినియోగించుకోవాలని కమిషనర్ సుమతి సూచించారు. మ్యాచ్‌కు ముందు, తర్వాత, ప్రేక్షకులకు రవాణా సౌకర్యం కల్పించేందుకు అదనపు బస్సులు, అదనపు మెట్రో రైలు సేవలను అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు లేఖలు రాసినట్లు తెలిపారు. మ్యాచ్ ప్రారంభానికి రెండు గంటల ముందు నుంచి ప్రేక్షకులను స్టేడియంలోకి అనుమతిస్తామని తెలిపారు. స్టేడియంలో జరిగే మ్యాచ్‌కు సుమారు 40,000 మంది ప్రేక్షకులు హాజరవుతారని అంచనా వేస్తున్నట్లు కమిషనర్? సుమతి తెలిపారు. ఇప్పటికే 25,000 టిక్కెట్లు అమ్ముడయ్యాయన్నారు.

### సైబర్ నేరగాళ్ల కొత్త ప్లాన్ - 'నో' అని రిప్లై ఇచ్చినా
## మీ బ్యాంకు ఖాతా ఖాళీ



**హైదరాబాద్ ::** మారుతున్న టెక్నాలజీకి అనుగుణంగా సైబర్ నేరగాళ్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతున్నారు. రోజుకో కొత్త రీతిలో మోసాలకు పాల్పడుతున్నారు. ఓటీపీలు లేకుండా, లింకులను క్లిక్ చేయకుండానే ఖాతాలోని నగదును కాజేస్తున్నారు. నిరంతరం సైబర్ నేరగాళ్లపై నిఘా ఉంచినా, ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నా నేరగాళ్లు రోజుకో కొత్త మార్గంలో ప్రజల కష్టార్జితాన్ని దోచుకుంటున్నారు. విదేశీ నంబర్ల నుంచి వాట్సప్‌నకు మెసేజ్‌లు పంపి, బ్యాంకు ఖాతాలను ఖాళీచేస్తున్నారని హైదరాబాద్ సీపీ వీసీ సజ్జనర్ హెచ్చరించారు. బాధితులు ఓటీపీలు షేర్? చేసినా, లింక్‌లను క్లిక్ చేసినా, సైబర్ నేరగాళ్ల నుంచి వాట్సాప్? ద్వారా వచ్చిన మెసేజ్‌లకు కేవలం నో (ఛీ) అని సమాధానం ఇచ్చినా నష్టపోయే ప్రమాదం ఉందని అప్రమత్తం చేశారు. ఎలా మోసాలు చేస్తున్నారంటేగుర్తుతెలియని, అంతర్జాతీయ ఫోన్? నంబర్ల నుంచి బాధితుల వాట్సప్? నంబరుకు సందేశాలు పంపుతారు. మీ బ్యాంకు ఖాతా నుంచి కొంత సొమ్ము డెబిట్ అయిందని, నేరగాళ్ల నకిలీ మెసేజ్?లు పంపుతారు. వీటిని చూసి బాధితులు ఆందోళన చెందుతారు. ఈ పరిస్థితులను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటారు. 'ఈ లావాదేవీని మీరు చేయకుంటే నో అని రిప్లై ఇవ్వండి' అని ఇంకో మెసేజ్ పెడతారు. నగదు కోల్పోయామనే బాధలో ఉన్న వ్యక్తులు, పూర్తి సమాచారం తెలుసుకోకుండా వెంటనే 'నో' అని రిప్లై ఇస్తున్నారు. దీంతో వెంటనే వారి ఖాతాలోని సొమ్మంతా క్షణాల్లో మాయమవుతోంది.

### ఏజెన్సీలోని కానిస్టేబుల్ పోస్టుల్లో ఎస్టీలకు
## 75 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి



**హైదరాబాద్ :** తెలంగాణ ఏజెన్సీ ప్రాంతాల్లోని కానిస్టేబుల్ పోస్టుల్లో షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ)కు 75 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే జోక్యం చేసుకోవాలని ఆమె కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1988లో జారీ చేసిన జీవో 109, తెలంగాణ ఏర్పడిన తర్వాత 2018లో విడుదల చేసిన గెజిట్ నోటిఫికేషన్ 49 ప్రకారం ఏజెన్సీ ప్రాంతాల్లోని కానిస్టేబుల్ ఉద్యోగాల్లో ఎస్టీలకు 75 శాతం రిజర్వేషన్ కల్పించాలని కవిత పేర్కొన్నారు. అయితే, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవల జారీ చేసిన 2026 పోలీస్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్‌లో ఈ నిబంధనను అమలు చేయలేదని ఆమె ఆరోపించారు. దీనివల్ల ఆదివాసీ, గిరిజన యువత కానిస్టేబుల్ ఉద్యోగాలు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. గతంలో 2015, 2018, 2022 సంవత్సరాల్లో విడుదలైన కానిస్టేబుల్ నోటిఫికేషన్లలో ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ, గిరిజన యువతకు 75 శాతం రిజర్వేషన్లు అమలు చేశారని గుర్తుచేశారు. కానీ, 2026 నోటిఫికేషన్‌లో ఎందుకు అమలు చేయడం లేదని ఆమె ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

### హరీశ్ రావు మామ హనుమంతరావుకు
## హైకోర్టులో ఊరట



**హైదరాబాద్ :** బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు మామ మాధవరావు హనుమంతరావుకు సంబంధించిన భూవివాద ం కేసులో తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. ఆయనపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోవద్దని అధికారులను ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం వెలికట్ట గ్రామంలోని 3.22 ఎకరాల భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోనుందంటూ సెప్టెంబర్ 29న రెవెన్యూ అధికారులు హనుమంతరావుకు షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఈ నోటీసును సవాలు చేస్తూ ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీని పై విచారణ చేపట్టిన జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ పిటిషనర్‌ను ఆ భూమి నుంచి ఖాళీ చేయించడంచర్యలకు ఆదేశించారు.

### లంచం కేసులో తహసీల్దార్, సర్వేయర్‌ను
## అరెస్ట్ చేసిన ఏసీబీ అధికారులు




**హైదరాబాద్ :** హైదరాబాద్ శివారు అబ్దుల్లాపూర్‌మెట్‌లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు నిర్వహించిన దాడుల్లో తహసీల్దార్, సర్వేయర్ పట్టుబడ్డారు. భూమి సర్వేకు సంబంధించి ఓ వ్యక్తి నుంచి రూ.20 లక్షలు లంచం తీసుకుంటుండగా సర్వేయర్‌ను ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఒక భూమికి సంబంధించి సర్వే నిర్వహించి, హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం జాయింట్ ఇన్‌స్పెక్షన్ రిపోర్ట్ (జేఐఆర్) అందజేసేందుకు అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ బి. సుదర్శన్ రెడ్డి, మండల సర్వేయర్ బటుక శ్రీనివాసులు లంచం డిమాండ్ చేశారు. ఇందుకోసం తొలుత రూ.30 లక్షలు అడగగా, చివరకు రూ.20 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. బాధితుడి ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వలపన్నారు. ఒప్పందం ప్రకారం బాధితుడి నుంచి సర్వేయర్ శ్రీనివాసులు రూ.20 లక్షల నగదు తీసుకుంటుండగా అధికారులు అతడిని పట్టుకున్నారు. సదరు నగదును స్వాధీనం చేసుకున్న అధికారులు, శ్రీనివాసులు చేతులకు కెమికల్ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఏసీబీ విచారణలో, తహసీల్దార్ సుదర్శన్ రెడ్డి ఆదేశాల మేరకే తాను లంచం తీసుకున్నట్లు సర్వేయర్ అంగీకరించాడు. దీంతో అధికారులు తహసీల్దార్‌ను కూడా అదుపులోకి తీసుకున్నారు.

# దుబ్బాక నియోజకవర్గంలో కాలువలు, ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధి పనులపై సమీక్షించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**--పెండింగ్ పనులను వేగవంతం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలి**
**-- ఇరిగేషన్, ఆర్అండ్‌బీ అధికారులకు ఆదేశాలు**



**దుబ్బాక :** దుబ్బాక నియోజకవర్గంలో రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా కాలువల పనులను, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేలా రహదారుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారు అధికారులను ఆదేశించారు. ఈరోజు ఉదయం దుబ్బాకలోని తన క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని దౌల్తాబాద్, చేగుంట,నార్సింగి మండలాల్లో ,శంకరంపేట కెనాల్ కాలువల నిర్మాణం, పెండింగ్ పనుల ప్రస్తుత స్థితిగతులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా నియోజకవర్గంలోని వివిధ ఆర్అండ్‌బీ రోడ్ల అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ముఖ్యంగా మంజూరైన సూరంపల్లి--నాచారం రహదారి, మెట్టు రోడ్డు, దౌల్తాబాద్--తిమ్మాపూర్ రహదారుల అభివృద్ధి పనులపై ప్రత్యేకంగా చర్చించారు. పనుల అమలులో ఎదురవుతున్న సమస్యలు, జాప్యానికి గల కారణాలను తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గంలో అసంపూర్తిగా ఉన్న కాలువలు, పెండింగ్‌లో ఉన్న రహదారుల పనులను గుర్తించి, వాటిని వేగవంతంగా పూర్తి చేసేలా నిరంతరం పర్యవేక్షించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కాలువల పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడంతో పాటు, రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలని స్పష్టం చేశారు. కాలువల నిర్మాణానికి సంబంధించి అటవీ శాఖ భూములకు సంబంధించిన సమస్యలను కూడా అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ స్థాయిలో అవసరమైన అనుమతులను త్వరితగతిన పొందేందుకు కృషి చేస్తానని తెలిపారు. అభివృద్ధి పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, రైతుల సాగునీటి అవసరాలు తీర్చడంతో పాటు రహదారుల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి గారు తెలిపారు. ఈ సమీక్ష సమావేశాల్లో సంబంధిత ఇరిగేషన్, ఆర్అండ్‌బీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# దుర్గామాత దర్శనం చేసుకున్న ఏఎన్ఎం మౌనిక, ఆశలు కార్యకర్తలు శ్రీదేవి నాగమణి



**మన ప్రజావాణి జుక్కల్ ఆర్ సి ప్రతినిధి అక్టోబర్ 13**
కామారెడ్డి జిల్లా జుక్కల్ మండల కేంద్రంలో గల దుర్గామాత దర్శనం తీసుకున్న ఏఎన్ఎం మౌనిక, ఆశ వర్కర్లు నాగమణి, శ్రీదేవి అమ్మ తల్లి మమ్మల్ని దీవించి పిల్ల పాపలతో చల్లగా ఉండేలా చూడాలని మొక్కులు మొక్కుకున్నారు.. తల్లి నీ ఆశీర్వాదం ఉంటే మేము ఎల్లవేళలా ఆనందంగా ఉంటామని దుర్గామాత ఆశీర్వాదం తీసుకున్నారు..

# పంచాయతీ వద్ద బ్లేడ్ ట్రాక్టర్ ఉంది.. కానీ రోడ్డు పక్కన ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు

**రాయికల్, అక్టోబర్ 13 (ప్రజావాణి):**
రాయికల్ మండలంలో పరిస్థితి చూస్తే ప్రజలకు ఒకే ఒక సందేహం వస్తోంది. ప్రతి గ్రామ పంచాయతీ వద్ద ప్రభుత్వం లక్షల రూపాయలు వెచ్చించి ఇచ్చిన ట్రాక్టర్, దానికి తోడు రోడ్లు శుభ్రం చేయడానికి ప్రత్యేకంగా బ్లేడు ఉన్నా, మరి రోడ్ల పక్కన ఈ పిచ్చి మొక్కలు ఎందుకు ఇలా 5-6 అడుగుల ఎత్తున పెరిగాయి అని. మండలంలో ఏ గ్రామానికి వెళ్లినా రోడ్డుకు ఇరువైపులా తుమ్మ, జిల్లేడు, ముళ్ల పొదలు మనిషి ఎత్తున ఏపుగా పెరిగి రోడ్డును కబ్జా చేశాయి. దీంతో రోడ్డు వెడల్పు 3-4 అడుగుల మేర తగ్గిపోయింది. రెండు వాహనాలు ఎదురెదురు వస్తే పక్కకు తప్పుకోవడానికి కూడా స్థలం లేకుండా పోయింది. ముఖ్యంగా మలుపుల వద్ద, కల్వర్టుల దగ్గర పిచ్చి మొక్కల కారణంగా ఎదురుగా వచ్చే వాహనం కనిపించక చిన్న చిన్న ప్రమాదాలు నిత్యం జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇక రాత్రి వేళల్లో ఈ పొదల్లో నుండి పాములు, తేళ్లు, ఇతర విషపురుగులు బయటకు వచ్చి రోడ్డుపైకి చేరుతుండటంతో పాదచారులు, తెల్లవారుజామున పొలాలకు వెళ్లే రైతులు, కూలీలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పిల్లలను సైకిళ్లపై బడికి పంపాలంటేనే తల్లిదండ్రులు భయపడే పరిస్థితి నెలకొంది. అత్యంత బాధాకరమైన విషయం ఏమిటంటే, ప్రతి



పంచాయతీ వద్ద ట్రాక్టర్ తో పాటు బ్లేడు అందుబాటులో ఉండి, దానికి డీజిల్ కు నిధులు కూడా ఉన్నా, నెలల తరబడి ఒక్కసారి కూడా బ్లేడుతో రోడ్ల పక్కన శుభ్రం చేసిన దాఖలాలు లేవు. చాలా గ్రామాల్లో బ్లేడులు పంచాయతీ కార్యాలయం ముందు నిరుపయోగంగా పడి ఉన్నాయి. కార్యదర్శులు, సర్పంచులు పట్టించుకోకపోవడంతోనే ఈ దుస్థితి నెలకొందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో మాత్రం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం +) కూలీలతో రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి, పూల మొక్కలు నాటి సాసర్లు ఏర్పాటు చేయడంతో ఆ రోడ్లు చూడముచ్చటగా, శుభ్రంగా కనిపిస్తున్నాయి. ఏ గ్రామ ప్రజలు ఆ గ్రామ పొలిమేర వరకు రోడ్ల వెంబడి ఉన్న పిచ్చి మొక్కలను శుభ్రం చేస్తే రోడ్లపై ఎలాంటి ప్రమాదాలు జరగవని, ఇదే స్ఫూర్తితో మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలు తమ వద్ద ఉన్న ట్రాక్టర్ బ్లేడులను, అవసరమైతే జెసిబిలను ఉపయోగించి వారం రోజుల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను పూర్తిగా తొలగించి ప్రజలకు సురక్షిత ప్రయాణాన్ని అందించాలని మండల ప్రజలు మండల అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# గట్టుసింగారంలో విహెచ్ఎన్సీ కార్యక్రమం

**గ్రామస్థుల ఆరోగ్య పరిరక్షణకు సమష్టి కృషి చేయాలి**



**కూసుమంచి, అక్టోబర్ 13 (ప్రజావాణి):**
కూసుమంచి మండల పరిధిలోని గట్టుసింగారం గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం విహెచ్ఎన్సీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థుల ఆరోగ్య పరిరక్షణ, గ్రామంలో ఆరోగ్య సేవల నిర్వహణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం. విజయ, పంచాయతీ కార్యదర్శి ఏ. ప్రసాద్, వార్డు సభ్యులు, ఏఎన్ఎం కే. సునీత, ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. గ్రామస్థులకు ఆరోగ్య సేవలు అందించడంలో వైద్య సిబ్బంది, గ్రామపంచాయతీ ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. గ్రామంలో ఆరోగ్య సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు. గ్రామస్థులకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించేందుకు సంబంధిత సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఈ కార్యక్రమం ద్వారా తెలియజేశారు.

# నాలుగున్నరేళ్లుగా ఎదురుచూపులేనా?

**హసన్‌పర్తి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమి ఎక్కడ?**
**ప్రభుత్వ భూమి కేటాయింపులో జాప్యం.. విద్యుత్ సమస్యలతో ప్రజలు, వ్యాపారుల ఇక్కట్లు!**
**8 వేలకుపైగా విద్యుత్ కనెక్షన్లు.. 300 ట్రాన్స్‌ఫార్మర్లు.. అయినా సబ్‌స్టేషన్ నిర్మాణానికి నోచుకోని వైనం**
**ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం..**
**సబ్‌స్టేషన్ నిర్మాణం వెంటనే చేపట్టాలని డిమాండ్**

**హసన్‌పర్తి, అక్టోబర్ 12 (మన ప్రజావాణి):**
హసన్‌పర్తి మండల కేంద్రంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు మంజూరైన సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన ప్రభుత్వ భూమిని వెంటనే కేటాయించాలని ప్రజలు,



రైతులు, వ్యాపారులు కోరుతున్నారు. సుమారు నాలుగున్నరేళ్లుగా సబ్‌స్టేషన్ నిర్మాణం పెండింగ్‌లో ఉండటంపై ఆవేదన వ్యక్తం చేస్తూ హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. మండల కేంద్రంలో 8 వేలకుపైగా గృహ, వాణిజ్య విద్యుత్ కనెక్షన్లు, దాదాపు 300 ట్రాన్స్‌ఫార్మర్లు ఉండటంతో విద్యుత్ వినియోగం అధికంగా ఉందని తెలిపారు. తరచూ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురవడం, ఫ్యూజులు పోవడం, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. సబ్‌స్టేషన్‌కు అనువైన ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి కేటాయించడంతో పాటు, విద్యుత్ శాఖలో సిబ్బంది కొరతను కూడా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యాపారవేత్తలు దాడి శ్రీకాంత్ యాదవ్, గౌరిశెట్టి కృష్ణమూర్తి, హరీష్, పాఠశాలల కరస్పాండెంట్లు, రైతులు మారపల్లి రామచంద్రారెడ్డి, వీసం కరుణాకర్ రెడ్డి, మారేపల్లి జైపాల్ రెడ్డి, వల్లాల గణేష్, తలకొక్కుల ఐలయ్య, జన్ను సురేష్, వేల్పుల రామయ్య, తోట పాల్గొన్నారు.

# చిన్న మండవ వ్యవహారంలో అధికారుల ఉదాసీనత...?

**- ఉలుకు పలుకులేని అధికార యంత్రాంగం..?**
**- ఆగ మేఘాల మీద రెవెన్యూ సమావేశం...?**
**ఇంతకీ...!**
**- మ్యానువల్ బిల్లులు అక్రమ వసూళ్లపై విచారణ చేస్తారా... లేక సద్దుబాటు చేస్తారా...?**
**ఆగ మాగం అగమ్య గోచారం..**

**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి**
ఖమ్మం జిల్లా చింతకాని మండలం చిన్న మండవ ప్రభుత్వ ఇసుక క్వారీ వద్ద రెవెన్యూ ఉద్యోగుల అక్రమ బినామీ ఫోన్ పేలు మ్యానువల్ బిల్లులపై సంబంధిత శాఖ అధికారులు ఆరా తీసి సర్దుబాటు చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం మేరకు తెలుస్తోంది. ప్రధా నంగా ప్రభుత్వ ఆదాయానికి అనుమతులు అనే సాకుతో ప్రభుత్వానికి చెల్లించాల్సిన రాయల్టీని ఎగ్గొడుతూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న సంబంధిత రెవెన్యూ మైనింగ్ శాఖల అధికారులు నిర్లక్ష్యంగా ఉదాసీనంగా వ్యవహరించడం సంచలనం కలిగిస్తోందని సమాచారం. మన ప్రజావాణి వరుస కథనాలకు జిల్లా స్థాయి అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. కానీ యధావిధిగా సర్దుబాటు చేసుకున్నట్లు పలువురు మండల ప్రజలు స్థానికులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. మన ప్రజావాణి కథనంలో పేర్కొన్న అంశాలపై విస్తృతంగా చర్చ జరిగినప్పటికీ కొందరు ప్రశ్నించే గొంతుకలు సైతం నైతిక మద్దతు ప్రకటించడం విశేషం. ఇప్పటికైనా సంబంధిత జిల్లా కలెక్టర్ రెవిన్యూ డివిజనల్ అధికారులు క్షేత్రస్థాయిలో జరుగుతున్న మ్యానువల్ బిల్లులపై అక్రమ వసూళ్లపై సమగ్రంగా విచారణ చేసి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

# నైనుపాక ఆలయ అభివృద్ధిపై నిర్లక్ష్యం ఇంకెన్నాళ్లు?

**దక్షిణ భారతంలోనే అరుదైన సర్వతోభద్ర ఆలయం.. వసతులు కరువు**

**చిట్యాల మండలం అక్టోబర్13 (ప్రజావాణి):**
తెలంగాణలోనే అరుదైన, దక్షిణ భారతదేశంలో మరెక్కడా లేని ఏకశిల సర్వతోభద్ర ఆలయం నైనుపాకలో నిర్లక్ష్యానికి గురవుతోంది. చిట్యాల మండలం నైనుపాక గ్రామంలో ఉన్న ఈ అద్భుత ఆలయాన్ని 13వ శతాబ్దంలో కాకతీయులు నిర్మించారు.

ఆలయ ప్రత్యేకత:
ఒకే పెద్ద గులాబీ ఇసుకరాయి కొండపై నాలుగు వైపులా నాలుగు దేవతామూర్తులు ఉండటం ఈ ఆలయ ప్రత్యేకత.

- తూర్పున - యోగ నరసింహ స్వామి
- దక్షిణాన - కాళీయ మర్దన కృష్ణుడు
- పడమర - బలరాముడు
- ఉత్తరాన - శ్రీరామచంద్రుడు

50 అడుగుల గోపురం కూడా ఆ రాతిలో భాగమే. ఇది మన పూర్వీకుల శిల్పకళా నైపుణ్యానికి నిదర్శనం. ప్రతి ఏటా ముక్కోటి ఏకాదశి (వైకుంఠ ఏకాదశి) నాడు ఇక్కడ పెద్ద జాతర



జరుగుతుంది. సర్పదోషాల నివారణకు గరుడాళ్వార్ ను దర్శించుకునేందుకు భక్తులు వేల సంఖ్యలో వస్తారు. కానీ వసతులు ఎక్కడ? ఇంతటి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాముఖ్యత ఉన్న ఆలయానికి వెళ్లేందుకు సరైన రోడ్డు లేదు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, నీడ కోసం షెడ్లు లేవు. ఆలయ పరిసరాల్లో పిచ్చి మొక్కలు పెరిగి అధ్వానంగా మారింది. ప్రభుత్వం టూరిజం సర్క్యూట్ లో చేర్చి అభివృద్ధి చేస్తామని హామీలు ఇచ్చినా, ఇప్పటివరకు నిధులు విడుదల కాలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొలనుపాక, ఏడుపాయల ఆలయాలకు ఇస్తున్న ప్రాధాన్యతలో కనీసం 10 శాతం ఈ అరుదైన ఆలయానికి ఇచ్చినా, ఇది పెద్ద పర్యాటక కేంద్రంగా మారుతుందని భక్తులు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నైనుపాక ఆలయాన్ని అభివృద్ధి చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com